



## అవకాశమిస్తే అండగా ఉంటా

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి



కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

వేములవాడ, డిసెంబర్ 30: వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే నిరుద్యోగు యువతకు అండగా ఉంటానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వేములవాడలోని సంస్కృత కళాశాల అధ్యాపకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్న నాకు అవకాశం కల్పిస్తే పట్టభద్రుల గొంతుకనై వినిపిస్తానని స్పష్టం చేశారు. విద్యారంగంలో ఉన్న అవగాహనతో విద్యారంగ సమస్యలపై తాను పోరాడుతానని తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు సందవేని తిరుపతి, చంద్రప్రకాశ్, వెంగళ రామకృష్ణ గౌడ్, అనిత, ఉపాధ్యాయులు రమాదేవి, సుమలత, నాగజ్యోతి, శ్రీలత, శ్రీకాంత శర్మ, రవి, శిరీష, తిరుపతి తదితరులున్నారు.

### నిరుద్యోగులకు ప్రత్యేక యాప్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 30: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత యాప్ రూపొందించి అందుబాటులోకి తెచ్చినట్లు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ పట్టభద్రుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ రూపకల్పనలో ముందుంటానని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ భాగస్వామిగానైనా, ప్రతిపక్షంలోనైనా ఉండి కోట్లాడుతానని వెల్లడించారు. బీఎడ్ పూర్తి చేసుకున్న నిరుద్యోగ పట్టభద్రులకు కరీంనగర్‌లో ఉచితంగా టెట్ కోచింగ్ అందిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేస్తానని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజన్న, వెంకట్, మహేశ్, నాగరాజు, శ్రీధర్, అజయ్, భూమేశ్, చంద్రశేఖర్, కమలాకర్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, నరేంద్రబాబు, పురుషోత్తం, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు కేకులు రెడీ



తిప్పాపూర్‌లోని ఒక బేకరీలో సిద్ధం చేస్తున్న కేకులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. కొత్త సంవత్సరం సందర్భంగా బేకరీల్లో కేక్‌లు పెద్ద సంఖ్యలో తయారు చేస్తున్నారు. తక్కువ ధరతోపాటు ఆఫర్లు అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం రెండు వందల కేకులు అమ్ముతానని తిప్పాపూర్‌లోని ఒక బేకరీ యజమాని తెలిపాడు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడ ముందస్తుగా కేకులకు ఆర్డర్లు ఇచ్చారని, వాటి తయారీకి నిమగ్నమయ్యామన్నారు.

## శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 30: సిరిసిల్ల పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని టౌన్ సీఐ కృష్ణ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో డీజేలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతోషాల నడుమ నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. మద్యం దుకాణాలు, వైన్ షాప్స్ రాత్రి 12గంటల వరకు, బార్‌అండ్ రెస్టారెంట్స్ రాత్రి 1వరకు ప్రభుత్వ అనుమతి పాటించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇళ్లల్లో ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణికి 141 దరఖాస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, డిసెంబర్ 30 : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేసి, సమస్యను పరిష్కరించాలని సూచించారు.

కాగా ప్రజావాణికి వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులు రెవెన్యూ శాఖకు 56, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 26, ఎస్పీకి 7, ఎస్‌డీసీ, జిల్లా సంక్షేమాధికారికి ఐదు చొప్పున, విద్యాశాఖకు 4, ఉపాధి కల్పన శాఖకు 3, జిల్లా పంచాయతీ అధికారి, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్, సర్వే, వ్యవసాయ శాఖ, ఎంపీడీవో ఎల్లారెడ్డిపేటకు రెండు చొప్పున, ఎంపీడీవో కోనరావుపేట, వీర్నపల్లి, వేములవాడ రూరల్, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి డీఎం డబ్ల్యూవో, ఎల్‌డీఎం, ఈవో వేములవాడ టెంపుల్, లేబర్ ఆఫీసర్, ఇరిగేషన్, ఏరియా దవాఖాన, ఎస్సీ కార్పొరేషన్, సెస్, అటవీ శాఖకు ఒకటి చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బ్యాటరీ సైకిల్ ఇప్పించండి

-గవ్వల శ్రీకాంత్, దివ్యాంగుడు



తన తండ్రి రాములు ఆటోడ్రైవర్ అని, తల్లి సత్తవ్వ కూలీ పనికి వెళ్తుందని, పేదరికంలో ఉన్నామని, తనకు బ్యాటరీ సైకిల్ ఇప్పించాలని ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు గవ్వల శ్రీకాంత్ కోరాడు. 10వ తరగతి వరకు చదివానని, ఉపాధి చూపించాలని గవ్వల శ్రీకాంత్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతి పత్రం అందించాడు.

### వ్యవసాయ భూమి కబ్జా చేశారు

-వేముల నాగమ్మ, వృద్ధురాలు



వేములవాడ గ్రామ శివారు అయ్యోరుపల్లిలో సర్వే నెంబర్ 697లో 1 ఎకరం 6 గుంటలు, 696లో 0.05 గుంటల తన వ్యవసాయ భూమిని పొనుగంటి బుచ్చయ్య అనే వ్యక్తి అక్రమంగా అతడి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని వృద్ధురాలు వేముల నాగమ్మ తెలిపింది. సంతకం ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని అడిగితే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని బెదిరిస్తున్నాడని తెలిపింది. తన భూమిని అక్రమంగా ఆక్రమించిన బుచ్చయ్యపై చర్యలు తీసుకుని తన పొలం ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంది.

### కమిషన్ ఇప్పించాలని నాయీబ్రాహ్మణుల వినతి



తమకు కమిషన్ ఇప్పించాలని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని 2వ కల్యాణ కట్టలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2వ కల్యాణ కట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు టికెట్ రూ.50 పై కమిషన్ ఇప్పించాలని వేములవాడ రూరల్, అర్బన్ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరారు. దేవస్థానం ఆదేశాలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉంటూ మొదటి కల్యాణ కట్టలో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు టికెట్‌పై కమిషన్ ఇస్తున్నారన్నారు. రూరల్, అర్బన్ సేవా సంఘం ఏర్పడి 2వ కల్యాణ కట్టలో తలనీలాలు తీసే విధులు నిర్వహిస్తున్నామన్నారు. 2014 నుంచి 2024 వరకు కమీషన్ ఇప్పించాలని వేడుకున్నారు. తలనీలాల వేలం కండీషన్‌లో కాంట్రాక్టర్ తరపున కాకుండా దేవస్థానం తరపున టికెట్‌పై కమీషన్ ఇప్పించాలని కోరారు. ఇక్కడ పీ నర్సయ్య, కే లక్ష్మణ్, కే నర్సింహులు, గడ్డం తిరుపతి, గడ్డం నరేశ్ తదితరులున్నారు.

### పెన్షన్ పునరుద్ధరించాలి

-లింగంపెల్లి రాజు, దివ్యాంగుడు



కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడు లింగంపెల్లి రాజు తనకు దివ్యాంగుల పెన్షన్ పునరుద్ధరించాలని కోరాడు. తనకు గతంలో దివ్యాంగుల పెన్షన్ వస్తుండేదని, తన దివ్యాంగ సర్టిఫికెట్ ఎక్స్‌పైరీ కావడంతో పెన్షన్ ఆగిపోయిందని తెలిపాడు. నూతన డిజేబులిటీ సర్టిఫికెట్ తీశానని తిరిగి తన పెన్షన్ పునరుద్ధరించాలని వేడుకున్నాడు.

## ఆర్యవైశ్యుల అన్నదానం

గంభీరావుపేట, డిసెంబర్ 30: మండల కేంద్రంలోని ఆర్యవైశ్యులు అమావాస్యను పురస్కరించుకుని సోమవారం అన్నదానం చేశారు. చనిపోయిన తమ కుటుంబ సభ్యుల పేరిట అచ్చయ్య స్వామి ఆలయం వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నెలల నుంచి ప్రతి అమావాస్య రోజున మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పసుపునూరి మహేశ్, ఆంజనేయులు, చీకోటి పూర్ణచందర్, సుదర్శన్, శ్రీనివాస్, రాము, తదితరులున్నారు.

## ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్, ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్ అజ్మీరా తిరుపతినాయక్

వీర్నపల్లి, డిసెంబర్ 30: ప్రజలందరూ కలిసి మెలసి ఉండి, గ్రామాభివృద్ధికి పాటుపడాలని జిల్లా విజిలెన్స్, ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్ అజ్మీరా తిరుపతినాయక్ అన్నారు. మండలంలోని బాబాయిచెరువు తండాలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించగా, తహసీల్దార్ మారుతిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గాన్ని ఎంచుకోవద్దన్నారు. గ్రామాల్లో కుల వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ లక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ లచ్చయ్య, మాజీ ఉప సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నేత సంతోష్‌నాయక్, తదితరులున్నారు.

ఇల్లంతకుంట, డిసెంబర్ 30 : అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంధ్య, ఏఈవో రవళి, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్, డిసెంబర్ 30 : వేములవాడ రూరల్ మండలం తుర్కాకాషిపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చందుర్తి, డిసెంబర్ 30 : అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అంజయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, మండల పరిషత్ సూపరింటెండెంట్ సురేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



వేములవాడ టౌన్ : గెలుపొందిన విద్యార్థులతో మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 30: ప్రభుత్వోన్నత పాఠశాలలో వేములవాడ అర్బన్, రూరల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు అర్బన్, రూరల్ మండల విద్యాధికారులు బన్నాజీ, కిషన్ బహుమతులు అందించారు. ఇక్కడ ఉపాధ్యాయులు రాజరత్నం, సదానందం, శ్రీకాంతరావు, మానువాడ శంకర్, తిరుపతి, మురళి, జీవన్, ఉపాధ్యాయులున్నారు.

కోనరావుపేట, డిసెంబర్ 30: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. బాలుర కేటగిరీలో సుద్దాల ఉన్నత పాఠశాల సాయితేజ ప్రథమ స్థానం, హర్షవర్ధన్‌రెడ్డి రెండో స్థానం, నిమ్మపల్లి గాయత్రి తృతీయ స్థానంలో నిలువగా ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలు అందజేశారు. బాలికల కేటగిరీలో కేజీబీవీ పాఠశాలకు చెందిన సంజన ప్రథమ స్థానం, ప్రణీత ద్వితీయ స్థానం, అఖిల తృతీయ స్థానంలో నిలువగా వీరంతా జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు రాజేశం, జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు రెడ్డి రవి, ఫోరం మండలాధ్యక్షుడు చిరంజీవి, జనరల్ సెక్రటరీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట, డిసెంబర్ 30 మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇక్కడ మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, సోషల్ ఫో రం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, మండల బాధ్యుడు అనిల్ ఉన్నారు.

గంభీరావుపేట, డిసెంబర్ 30: మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్టును నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని జిల్లా కార్యదర్శి శీలాకుమార్ తెలిపారు.